రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:24 (ఆదివారం సాయంత్రం) సహర్: 5:01 (సోమవారం ఉదయం)

రహదారులకు అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, మార్చి22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో రహదారులు వేయలేకపోతున్నామని శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రస్తావించారు. పలు గ్రామాల్లో రహదారులు సరిగ్గాలేకపోవడంతో గర్భవతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు అత్యవసర సమయాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని మాట్లాడారు. రహదారుల అనుమతుల కోసం అటవీశాఖ అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన అనుమతులు ఇవ్వడం లేదన్నారు. బడుగు బలహీనవర్గాల అభివృద్ధి పై చర్చించడానికి అసెంబ్లీ సమావేశాల్లో అవకాశం ఇవ్వాలని కోరారు. బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై మాట్లాడే హక్కు సైతం అసెంబ్లీలో కల్పించడం లేదని ఒక సీనియర్ శాసనసభ్యుడిగా అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో వీలుకాకపోతే రెండుమూడు రోజులకు ఒకసారైన మాట్లాడే అవకాశం కల్పిస్తే నియోజకవర్గ సమస్యలు తెలియజేస్తామని వేడుకున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమాదేవి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. అంగన్‌వాడీ టీచర్ పద్మ, ఏఎన్ఎం నాగలక్ష్మీ, సహాయకురాలు లత ఉన్నారు.

అసైన్డ్ భూముల లెక్క తేలేనా?



- ఎల్ఆర్ఎస్ పరిశీలనలో భాగంగా గుర్తింపునకు చర్యలు
- ప్రభుత్వ నిర్ణయంతో అక్రమార్కుల్లో గుబులు
- జిల్లాలో పెద్ద ఎత్తున భూములు అన్యాక్రాంతం
- విచ్చలవిడిగా వెంచర్లు చేసి ప్లాట్ల అమ్మకాలు
- ఏజెన్సీ భూములనూ వదలని రియల్టర్లు

మంచిర్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో....అసైన్డ్ భూముల గుర్తింపును చేపట్టాలని రేవంత్ సర్కారు నిర్ణయానికి వచ్చింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎంతమేరకు భూములు అసైన్ చేయబడ్డాయి, ఎక్కెడెక్క ఆ భూములును ప్లాట్లుగా మార్చారు..? ఎన్ని భూములు అన్యాక్రాంతం అయ్యాయి...? అనే అంశాలపై స్పష్టత రానుంది. సర్కారు నిర్ణయం వల్ల అసైన్డ్ భూముల లెక్క ఇక పక్కాగా తేలనుంది. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో అసైన్డ్ భూములు ఎన్ని ఉన్నాయి..? అవి ఎవరి చేతిలో ఉన్నాయి..? ఎన్ని పరాధీనం అయ్యాయి..? అనే లెక్కలు లేవు. గత ప్రభుత్వాలు ఈ దిశగా పెద్ద ప్రయత్నాలు చేయలేదు. అసలు అసైన్డ్ భూములపై గత బీఆర్ఎస్ సర్కారు పెద్దగా దృష్టి సారించలేదన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి.

అసైన్డ్ భూముల లెక్కలపై ఆరా..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేటప్పుడు అసైన్డ్ భూములపైనా ప్రధానంగా దృష్టిసారించాలని రేవంత్ సర్కారు కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జారీ చేసిన మార్గదర్శకాల్లో ఎల్ఆర్ఎస్ ఆమోదం కోసం క్షేత్రస్థాయిలో జరిపే పరిశీలనలో మున్సిపల్ అధికారులకు తోడు రెవెన్యూ, నీటిపారుదల శాఖకు భాగస్వామ్యం కల్పించింది. గతంలో ఒక్క మున్సిపాలిటీ అధికారులు, లేదంటేవారి కిందిస్థాయి సిబ్బంది మాత్రమే పరిశీలన జరిపేవారు. దరఖాస్తు చేసుకున్న స్థలాలు అసైన్డ్ భూములా...? కాదా...? అనేది తమకు అందుబాటులో ఉన్న రికార్డు ప్రకారం మాత్రమే ధృవీకరించుకునేవారు. మున్సిపాలిటీ వద్ద ఉన్న అరకొర రికార్డుల వల్ల కొన్నిసార్లు అసైన్డ్ స్థలాలు సైతం రెగ్యులరైజ్ అయిన ఉదంతాలు ఉన్నాయి. దీనికి తోడు కొందరు మున్సిపల్ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది క్షేత్ర పరిశీలనలో అవి అసైన్డ్ భూములు అని తేలినా ముడుపులకు ఆశపడి రెగ్యులర్ చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో మున్సిపల్ శాఖతో పాటు రెవెన్యూ మిగతా 7వ పేజీలో

ధరణి రాకతో ఇష్టారాజ్యం..

ధరణి పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తరువాత కబ్జాదారులు కోట్ల విలువైన అసైన్డ్ భూములను అప్పనంగా కాజేసి, వాటిలో దర్జాగా వెంచర్లు ఏర్పాటు చేసి విచ్చల విడిగా విక్రయాలు చేసి సొమ్ము చేసు కున్నారు. ఒకసారి అవి రెగ్యులరైజ్ అయితే శాశ్వ తంగా వారి సొంతమైనట్లే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపాలిటీల వద్ద పెండింగులో ఉండగా, ఒక్క మంచిర్యాల మున్సిపాలిటీలోనే 600 వీఎల్టీ (వేకేట్ ల్యాం డ్ ట్యాక్స్) దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికా రులు తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీల నకు ముగ్గురు అధికారుల చొప్పున పలు బృందాల ను నియమించారు. ప్రస్తుతానికి 2020 ఆగస్టు 26వ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయి ఎల్ఆర్ఎస్ కోసం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికే ఆ అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.

జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యతకు ప్రత్యేక కార్యక్రమం

అజ్మీరా పురుషోత్తం నాయక్, వయోజన విద్యా ప్రాజెక్టు అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : జిల్లాలో వయోజన విద్య అక్షరాస్యతకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

అధికారి : జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కార్యచరణ రూపొందించి సంపూర్ణ వయోజన విద్య అక్షరాస్యతకు కృషి చేస్తున్నాం. నాలుగేళ్లుగా జిల్లాలో చేస్తున్న కార్యక్రమాలు సంతృప్తినిస్తున్నాయి. బెల్లంపల్లిలోని రంగంపేట, లక్సెట్టిపేటలోని ముత్యంపేట, మందమర్రిలోని నార్లాపూర్, మంచిర్యాలలోని ఆండాలమ్మ కాలనీ, జన్నారంలోని గోండుగూడ, దండెపల్లిలోని కొర్విచెల్మలో సంపూర్ణ అక్షరాస్యత సాధించా.

ఆంధ్రజ్యోతి : వంద రోజుల్లో వంద శాతం సంపూర్ణ అక్షరాస్యత నినాదం అమలవుతుందా?

అధికారి : 22 గ్రామపంచాయతీల్లో ఈ నినాదంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రత్యేకంగా గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి అక్షరాస్యత సాధించేలా కృషి చేస్తున్నాం. కాసిపేట మండలంలోని గిరిజన ప్రాంతాల్లో సంపూర్ణ అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దడంలో సఫలీకృతం అయ్యాం.

ఆంధ్రజ్యోతి : వృత్తి నైపుణ్యత కోర్సులు ఎంత వరకు వచ్చాయి?

అధికారి : కలెక్టర్ ఆదేశాల మేరకు వృత్తి నైపుణ్యత కోర్సులను ఏర్పాటు చేస్తూ మహిళకు ప్రత్యేకంగా వారి ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా అక్షరాస్యత కేంద్రాలతో పాటు కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నాం. వారికి అవసరమైన సామగ్రిని, కుట్టు మిషన్‌లను విరాళంగా ఇచ్చేందుకు దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ, లయన్స్‌క్లబ్, రోటరీ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థలు సైతం ముందుకు రావడం సంతోష దాయకం. గిరిజన ప్రాంతాల్లోని వయోజనులకు విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

-మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

విద్యారంగంలో అగ్రగామిగా నిలుపుదాం

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, మార్చి22 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో జిల్లాను దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న తెలంగాణ క్షేత్రాలు, అక్షరదర్శనం రెండో రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల 30 ఏళ్లలో వెనుకబడి ఉందన్నారు. మంచిర్యాలను విద్యా, సాంకేతిక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఆయనతో పాటు తాజా మాజీ ప్రజాప్రతినిధులు, ప్రిన్సిపాల్ చక్రపాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముస్లింలకు తోఫా కిట్ల పంపిణీ

లక్సెట్టిపేట: రంజాన్ పండుగను కుటుంబ సభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. రంజాన్ పండగ సందర్భంగా కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్డెన్స్‌లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో కలిసి తోఫాకిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, ట్రాన్స్‌పోర్టు మెంబర్ అంకతి శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మాజీ కౌన్సిలర్లు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చిన్న వెంకటేష్ పాల్గొన్నారు.

దండేపల్లి: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం సేవ చేయాలనే తపనతో కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని ముస్లిం మహిళలకు రంజాన్‌కా తోఫా కిట్‌లను డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు త్రిమూర్తి, లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందు, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు, జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

ఖైదీలు క్రమశిక్షణతో ఉండాలి



ఆటవస్తువులు అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీనివాసులు

లక్సెట్టిపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అండర్ ట్రైన్స్ ఖైదీలు క్రమశిక్షణతో ఉండాలని జిల్లా న్యాయాధికారి బోయ శ్రీనివాసులు సూచించారు. శనివారం పట్టణంలోని సబ్ జైలును ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ చిన్న చిన్న తప్పులు చేసి విచారణ నిమిత్తం సబ్ జైలులో ఉన్న వారంతా సమయం వృధా చేసుకోకూడదన్నారు. బయటకు వెళ్లిన తర్వాత కూడా ఇదే క్రమశిక్షణతో ఉంటు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలన్నారు. అనంతరం అండర్ ట్రైన్స్ ఖైదీల కోసం ఆట వస్తువులను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్, జైలు సూపరిండెంట్ తేజావత్ స్వామితో పాటు జైలు సిబ్బంది, ఉన్నారు.

నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సంఖ్య తగ్గుతుంది

రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నేరస్తులకు శిక్ష పడితేనే నేరాల సం ఖ్య తగ్గుతుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. రామగుండం పోలీసు కమిషనరేట్‌కార్యాల యంలో శనివారం కోర్టు డ్యూటి పని చేస్తున్న అధి కారులకు లైజనింగ్ అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తులకు శిక్షపడే విధంగా సాక్షులను ప్రవేశపెట్టి ట్రయల్ సజావుగా జరిగేలా చూడాలన్నారు. కోర్టులో బాధితులకు న్యాయం జరిగే విధంగా మానవత్వంతో మెలగాలన్నారు. దోషులకు శిక్షపడడంలో కోర్టు, కానిస్టేబుళ్ల బాధ్యత కీలకమైందన్నారు. నేరస్తులకు వారెంటు, సమన్లు సత్వరమే ఎగ్జిక్యూట్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కోర్టు ప్రాసి క్యూషన్ సంబందించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత స్టేషన్ హౌజ్ ఆఫీసరుకు తెలియజేయాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహాలు, సూచనలు పాటించాలని, పెండింగ్‌లో ఉన్న ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు సీసీటీ ఎస్ ఎస్‌లో డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. మెజిస్ట్రేట్ బాధితులు కోర్టు డ్యూటి కానిస్టేబుల్ మంచి క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లా రెడ్డి, లీగల్‌సెల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, చంద్రశేఖర్ గౌడ్, సీసీ హరీశ్‌తో పాటు పెద్దపల్లి, మంచి ర్యాల జోన్ కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మరణించి కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీసు సిబ్బంది కుటుంబాలకుఅండగా ఉంటానని రామగుండం పోలీసు కమిషనరేట్ అంబర్‌కిషోర్‌ఝా అన్నారు. మంచిర్యాల ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన నాగరాజు కుటుంబానికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు సిబ్బంది కుటుంబాల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచడంతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ సంధ్య, అధికారుల సంఘం అధ్యక్షులు బోర్ల కుంట పోచలింగం, పాల్గొన్నారు.

హనుమాన్ భక్తుల మాలధారణ

దండేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి దేవాలయంలోని అంజనేయస్వామి మందిరంలో శనివా రం హనుమాన్ భక్తులు అర్థ మండల మాలధారణ స్వీకరించారు. వచ్చే నెల 10నమహావీర జయంతి సందర్భంగా 406మంది పైగా భక్తులు ఆలయానికి తరలివచ్చి మాలాధారణలను ఆలయ అర్చకుల చేతుల మీదుగా స్వీకరించారు. ఆలయంలో దీక్షాపరులు హనుమాన్ చాలీసా పఠనం చేశారు. అనంతరం సత్యనారాయణ స్వామి, అయ్యప్ప, సాయిబాబా, పంచముఖి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయం వద్ద అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వెల్లడించారు.



భక్తులకు నియమనిష్టలను వివరిస్తున్న ఆలయ అర్చకులు

కలమడుగు పాఠశాల ఉపాధ్యాయుల పనితీరు భేష్

జన్నారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కలమడుగు ఉన్నత పాఠశాలను వరంగల్ ఆర్జేడీ కాటేపల్లి సత్య నారాయణ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులను పరిశలించి ఎస్సే టూ పరీక్షల నిమిత్తం ప్రణాళికాబద్దంగా చదివి పరీక్షలు చక్కగా రాయాలని సూచించారు. ఇప్పుడు కష్టపడి చదివితేనే పదవ తరగతిలో మంచి మార్కులు సాధించొచ్చని తెలిపారు. పాఠశాల పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు యూనిఫాంలో ఉండడం చూసి అభినందించారు. ఉపాధ్యాయులు యూనిఫాంలో ఉండడం సంతోషంగా ఉందని తెలిపారు. కలమడుగు పాఠశాల చక్కగా నడుస్తుందని కొనియాడారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కట్ట రాజమౌళి, పాటశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ అనుముల రాజన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



మందమర్రిలో సబ్‌హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్

మందమర్రిటౌన్, మార్చి22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. శనివారం స్థానిక డబుల్‌బెడ్‌రూం గృహాల వద్ద ప్రభుత్వ 20లక్షల నిధులతో సబ్ హెల్త్‌సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ సంక్షేమ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ ప్రజా సంక్షేమానికి తమ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. నియోజకవర్గంలో విద్యా వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇప్పటికే చెన్నూర్ నియోజకవర్గంలో కూడ ప్రభుత్వ వైద్యశాలను మరింత ఆధునీకరించడంతోపాటు నూతన హెల్త్‌సెంటర్ నిర్మాణంపై కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజలింగు, వైద్య సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉపేందర్‌గౌడ్, సుదర్శన్, రమేశ్, నర్సింగ్, పాల్గొన్నారు.

- ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని 104 సిబ్బంది చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర నర్సింహతో మాట్లాడి వేతనాలు చెల్లించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
- కొన్నేళ్లుగా జీవిస్తున్న తమకు నివాసాలు కూడ లేవని అన్ని విధాలుగా తాము అర్హులమని డ బుల్‌బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ కేకేస్, ఫిల్టర్‌బెడ్, కేకే5గని వద్ద నివసిస్తున్న కుటుంబాలు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి శనివారం వినతిపత్రం సమర్పించారు.
- నిరుపేదలకే డబుల్‌బెడ్‌రూం ఇండ్లు ఇటీవల అధికారులు పంపిణీ చేశారని ఎమ్మెల్యేకు తెలిపారు. శనివారం డబుల్‌బెడ్ రూం గృహాలను ఆయన సందర్శించారు. విద్యుత్, తాగు నీరు తదితర అంశాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జైపూర్‌పవర్ ప్లాంట్‌ను మరో 800 మెగావాట్ల సామర్థ్యానికి పెంచాలని సీఎంను కోరామన్నారు. అనంతరం పాత బస్టాండ్‌లోని కేకే ఓ సీపీ సమీపంలో గల శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు.

జమిలి ఎన్నికలతోనే దేశాభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జమిలి ఎన్నికలతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జమిలి ఎన్నికల నిర్వహణ వల్ల దేశంపై ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. 1980లో అప్పటి ఎన్నికల కమిషన్ జమిలి ఎన్నికలు నిర్వహించాలని సూచించినప్పటికి అప్పటి కాంగ్రెస్‌ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు.

పశువులు వ్యాధుల బారిన పడకుండా చూడాలి

డాక్టర్ సురేష్, పశువైద్యాధికారి



ఆంధ్రజ్యోతి: పశువులు వ్యాధుల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్: వేసవిలో పశువులు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పగటి పూట మేతకు వదల కూడదు. ఉదయం 10 గంటలకు ముందు, సాయంత్రం 5 తరువాత పశువులకు ఎక్కువగా నీరు తాగించాలి. మధ్యాహ్నం నీళ్ల చల్లుతుండాలి.

ఆంధ్రజ్యోతి: వేసవిలో ఎలాంటి మేత పశువులకు అందించాలి ?

డాక్టర్: మినరల్ ఇమిచ్చర్, ప్రొటీన్స్ విటమిన్స్ ఎనర్జిటెక్ దాణా అందించాలి. దీంతో పశువులు నీరస పడకుండా ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: పశువులకు ఎండ దెబ్బ తగలకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

డాక్టర్: పశువులకు ఎండ దెబ్బ తగిలినట్లయితే వాటిని చల్లని గాలి ప్రదేశానికి తీసుకెళ్లాలి. గోనె సంచులు కప్పి నీళ్ల చల్లాలి. వాటికి నీళ్ల తాగించాలి. వేసవిలో గొంతు వాపు, జబ్బువాపు వ్యాధి టీకా వేయించాలి.

ఆంధ్రజ్యోతి: పశువులకు పశుగ్రాసం, పశు సంవర్ధక శాఖ అందజేస్తుందా?

డాక్టర్: జోవార్ గడ్డి విత్తనాలు 50 శాతం సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయి. ప్రభు త్వం అనుమతి రాగానే అందజేస్తాం.

- కెరమెరి, ఆంధ్రజ్యోతి

విద్యార్థులు ఇష్టంగా చదవాలి

రెబ్బెన, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంగా చదువాలని సింగరేణి హైస్కూల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం గోలేటిలోని సింగరేణి హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వార్షిక ఫలితాలు, తదితర సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీఎం కార్యాయానికి చేరుకొని జీఎంను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు రవితేజ, ఉపాధ్యాయులు ఆర్లరెడ్డి, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

రెబ్బెన, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతాన్ని రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఖైరిగూడ ఓపెన్ కాస్టులో ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఖైరిగూడ పిట్ సెక్రటరి భాస్కరాచారి, జీఎం ఆఫీస్‌సెక్రటరి భీమేష్, ఏరి యా కార్యదర్శులు చంద్రకుమార్, మాధవకృష్ణ, కేంద్ర కమిటీ నాయకుడు సంజీవరెడ్డి, సెంట్రల్ ఆర్గనైజేషన్ కమిటీ నాయకులు నారాయణ, ఖైరిగూడ నాయకులు చిన్నయ్య, ప్రభాకర్, శ్రీకాంత్, సంతోష్, మల్లేష్, రాజేశం, శ్రీనివాస్, వామన్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థుల క్షేత్ర పర్యటన

కాగజ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సర విద్యార్థులు రెండు రోజులు క్షేత్ర స్థాయి పర్యటనల్లో పాల్గొన్నారు. రామప్ప, లక్నవరం ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్భంగా లక్నవరం పరిసర ప్రాంతాల్లో ఉండే అడవుల్లోని వృక్ష సంపద, శైవలాలు, నీటి మొక్కల గురించి అధ్యాయనం చేశారు. వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వీరమల్ల దేవేందర్ రెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్షేత్ర పర్యటనలో పాల్గొన్న సిబ్బంది, లెక్చరర్లను ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం అభినందించారు.

బీఆర్ఎస్ నాయకుల అరెస్టు

బెజ్జూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. టీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు గెల్లు యాదవ్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడిలో ముందస్తు సమాచారం మేరకు బెజ్జూరులో బీఆర్ఎస్ నాయకులు తిరుపతి, మోహన్, శంకర్ శంషుద్దీన్‌లను అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇలా అరెస్టు చేయడం సరి కాదని, దీన్ని ఖండిస్తున్నామని తెలిపారు.

రేపు వారసంత వేలం

కెరమెరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రతి ఆదివారం నిర్వహించే వార సంతకు సోమవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అంజద్‌పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ఎలాంటి బకాయిలు ఉండకూడదని షెడ్యూల్ తెగల వారు మాత్రమే పాల్గొనడానికి అర్హులని తెలిపారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విత్తన వరితో సిరులు

- ఏటేటా పెరుగుతున్న ఆడమగ పంట సాగు
- అందుబాటులో కంపెనీల ప్రతినిధులు
- లాభదాయకంగా ఉందంటున్న రైతులు



సాగు విధానం ..

రెండు వరుసలో మేల్ (మగ) వరి, 6-8 వరుల్లో ఫిమేల్(ఆడ) వరిని నాటుతారు. పలు కంపెనీలు సూచనల మేరకు విత్తనోత్పత్తి వరిని సాగు చేస్తారు. 5-8 సార్లు స్ప్రేలు, నాలుగు సార్లు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, పోటాస్ ఎరువులను సమపా ళ్లలో పొలాల్లో చల్లుతారు. ఈ వరి పంట పూత దశ కీలకం కాబట్టి 15-20 రోజుల వరకు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు మేల్(మగ) వరి నుంచి ఫిమేల్(ఆడ)వరికి తాళ్లు, కర్రల సహాయంతో పూతను క్రాసింగ్ చేస్తారు.

దహెగాం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యాసంగిలో హైబ్రీడ్ వత్తన వరిసాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. సాధారణ వరితో పోల్చితే లాభాలు ఎక్కువగా వస్తుండడం వల్ల రైతులు ఆడమగ వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. విత్తన వరి సాగు విస్తీర్ణం జిల్లాలో యేటా పెరుగుతోంది. ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు విత్తనాలు అందిస్తూ సాగులో మెళకువలు, యాజమాన్య పద్ధతులు సూచిస్తున్నారు. అవసరమైతే పెట్టుబడి సాయం చేస్తున్నారు. అనంతరం పండిన ధాన్యాన్ని ముందస్తు ఒప్పందం ప్రకారం కొనుబగోలు చేస్తున్నారు. దీంతో రైతుకు ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. యాసంగిలో జిల్లాలో సుమారు రెండు నుంచి మూడు వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

దహెగాం, కమ్మర్‌పల్లి, మర్రిపల్లి, గిరివెల్లి, ఖర్జీ, కల్వాడ, హత్తిని, కుంచవెల్లితో పాటు పలు గ్రామాల్లో ప్రైవేటు కంపెనీలు అందిస్తున్న విత్తనోత్పత్తి వరిని రైతులు సాగు చేస్తున్నారు.

విత్తనోత్పత్తిలో భాగంగా..

విత్తనోత్పత్తిలో భాగంగా ఆడమగ వరసలు వేసి సంకరీకరణ(క్రాసింగ్) చేసి విత్తనం పండిస్తారు. హైబ్రిడ్ వరి విత్తనోత్పత్తి విధానంలో విత్తనాలు అందజేయడంతో పాటు నారుమడుల యాజమాన్యం, నాట్లు వేయడం, ఎరువులు పురుగుల మందుల వాడకం, కలుపుతీత, కోతలు తదితర అంశాలపై కంపెనీ ప్రతినిధులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఫలితంగా రైతులు దిగులులేకుండా పోయిందని చెబుతున్నారు. తగిన సస్యరక్షణ చర్యలు చేపడితే ఎకరానికి సుమారు 15 నుంచి 18 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తోంది. ఆడ రకం ధాన్యాన్ని ముందుగా ఒప్పందం ప్రకారం నాణ్యతను బట్టి కొనుగోలు చేస్తున్నారు.

బేయర్ -716 ఫిమేల్ క్వింటాలు ధాన్యం రూ.14,000, బేయర్ రెండో రకం ఫిమేల్ ధాన్యం క్వింటాలుకు రూ.10,000, పయనీర్ కంపెనీ ఫిమేల్ ధాన్యం క్వింటాలు ధర రూ.8,700, వీఎస్ఆర్ కంపెనీ ఫిమేల్ ధాన్యం క్వింటాలుకు రూ.10,000, జువారి కంపెనీ ఫిమేల్ ధాన్యం క్వింటా లుకు రూ.11,500, యూఎస్ అగ్రి కంపెనీ ఫిమేల్ ధాన్యం క్వింటాలుకు రూ.12,000, సింజెంటా కంపెనీ ఫిమేల్ ధాన్యం క్వింటాలుకు రూ.7.400 చెల్లిస్తాయని రైతులు చెబుతున్నారు. మగ వడ్ల ధాన్యం దొడ్డు రకంగా మార్కెట్‌లో విక్రయించు కోవడంతో అదనపు ఆదాయం వస్తోందని చెబుతున్నారు.

ఐదేళ్లుగా సాగు చేస్తున్నాం..

నికాడి లోకేష్, రైతు, దహెగాం



బేయర్ కంపెనీ విత్తనోత్పత్తి ఐదేళ్లుగా సాగుచేస్తున్నాను. కంపెనీ వాళ్లు అందుబాటులో ఉండి సలహాలు, సూచనలు చేస్తారు. ఒప్పందం ప్రకారం కంపెనీ ప్రతినిధులే కొనుగోలు చేస్తున్నారు. చెప్పిన ప్రకారం మాకు డబ్బులు సైతం అందిస్తున్నారు. దీంతో మా పరిధిలో ఏటేటా విత్తన వరి సాగు పెరుగుతోంది.

కష్టానికి తగిన లాభం ఉంది..

కొండు సంతోష్, కౌలు రైతు



ఆడమగ వరి సాగు చేయడం వల్ల కష్టానికి తగిన లాభం ఉంది. పయనీర్ కంపెనీ విత్తనోత్పత్తి వరి సాగు ఆరేళ్లుగా చేస్తున్నాను. ఎకరానికి రూ.13-18 క్వింటాళ్ల విత్తనోత్పత్తి వరి పండిస్తాను. కౌలు చెల్లించాల్సింది పోనూ కష్టానికి తగ్గట్లుగా లాభం ఉంది. కంపెనీ ప్రతినిధులు సైతం అందు బాటులో ఉండి సూచనలు ఇస్తున్నారు.

కంపెనీలతో ఒప్పందం చేసుకోవాలి..

రామకృష్ణ, వ్యవసాయాధికారి



విత్తనోత్పత్తి సాగు చేసే రైతులు తప్పకుండా ఆయా కంపెనీలతో ఒప్పందం చేసుకో వాలి. రాళ్ల వర్షం, వాతావరణం సహకరించకపోతే విత్తనోత్పత్తి దిగుబడి రాక పోతే కం పెనీలు పరిహారం అందిస్తాయి. ప్రస్తుతం సాధారణ రకం వరి పొట్టదశ, కంకులు వెళ్లే దశలో ఉన్నాయి. రైతులు తగిన చర్యలు తీసుకోవాలి.

సామాజిక ఆసుపత్రి తనిఖీ

కాగజ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని సామాజిక ఆసుపత్రిని శనివారం నేషనల్ హెల్త్ మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీం సభ్యులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీం హెడ్ డాక్టర్ రమణ ప్రతి గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌పేషెంట్లు, ఔట్ పేషెంట్లకు సంబంధించిన వివరాలు పూర్తి స్థాయిలో ఎందుకు పొందుపర్చడం లేదని సిబ్బందిని ప్రశ్నించారు. స్కానింగ్ మిషన్ పని చేస్తోందా అన్న వివరాలు ఇన్‌చార్జిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో నేషనల్ హెల్త్ మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీం హెడ్ డాక్టర్ రమేశ్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న నేషనల్ హెల్త్ మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ఆధ్వర్యంలో రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్నామని తెలిపారు. పరిశీలనలో తేలిన అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోగులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో బృంద సభ్యులు, సామాజిక ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించాలి



తుంపెల్లిలో పర్యటిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారు మూల ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధమైన తగునీరు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండల తుంపెల్లి గ్రామంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి జరుగుత్ను నీటి సరఫరా ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు నీటి సమస్యలు లేకుండా ముందస్తు కార్యాచరణతో ఉండాలన్నారు. ప్రతి ఇంటికి నీరు అందుతున్న సమయం, రోజు వివరాలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా పథకం సంబందిత పైపులైన్ లీకేజీ ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించే విధంగా మిషన్ భగీరథ పథకం ఇంజనీర్లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటి నమూనాను పరిశీలించి పథకం ద్వారా ప్రతి గ్రామానికి తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా బావుల్లో, బోరు బావుల్లో నీరు అడుగంటి పోయే అవకాశం ఉన్నందున ప్రజలు మిషన్ భగీరథ నీటిని వినియోగించుకోవాలని చెప్పారు. దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, మిషన్ భగీరథ ఇంజనీర్లు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

20 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

భీమిని, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భీమిని మండలంలోని వడాల గ్రామంలో శనివారం భీమిని పోలీసుల దాడిలో గ్లైసిల్ రకానికి చెందిన సుమారు 50 వేల రూపాయల విలువ చేసే 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకిలీ పత్తి విత్తనాలను ఉన్నాయనే పక్కా సమాచారం మేరకు పోలీసులు భీమిని మండలంలోని వడాల గ్రామంలో జాడి పీరన్న ఇంటి వద్ద 20 కిలోలు పోలీసులు పట్టుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలను తన ఇంటి వద్ద అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయనే సమాచారంతో పోలీస్ సిబ్బంది దాడి చేసి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ విత్తనాలను అక్రమంగా ఎవరైనా చేరవేసిన ఇంట్లో నిలువ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలను వ్యవసాయశాక అధికారులు నిషేధిత పత్తి విత్తనాలుగా ధృవీకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడిలో పోలీస్ సిబ్బంది మహేశ్వరి, దీపిక పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

కన్నెపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వెంకటాపూర్ గ్రామానికి చెందిన చదువుల లక్ష్మణ్ మృతికి కారణమైన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. కన్నెపల్లి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..చదువుల లక్ష్మణ్ నిత్యం తన భార్య సమత అలియాస్ రోజాను కొట్టేవాడు. ఈ విషయాన్ని సమత కొడుకు తన మేనమామ అయిన అనిల్‌కు ఫోన్ చేసి తెలిపాడు. దీంతో అక్కడకు వచ్చిన సమత తండ్రి పార్వతి రాజేశం, సోదరుడు పార్వతి అనిల్‌లు లక్ష్మణ్‌పై దాడి చేశారు. ఈ దాడిలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్ మృతికి కారణమైన పార్వతి రాజేశం, పార్వతి అనిల్‌లను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్

సిర్పూర్(టి), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గతంలో నిషేధిత గడ్డి మందు, నకిలీ విత్తనాలు అమ్మిన పాత నేరస్తులను శనివారం సిర్పూర్(టి) తహ సీల్దార్ ఎదుట ఎస్సై కమలాకర్ బైండోవర్ చేశారు. అనంతరం సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మినా, ప్రోత్సహించినా, నిషేధిత గడ్డి మందును విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చోరీలకు పాల్పడుతున్న ఒకరి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాజేంద్రప్రసాద్

కాగజ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని బాలాజీనగర్ ప్రాంతంలో రెండు నెలలుగా చోరీలకు పాల్పడుతున్న ఒకరిని పట్టుకున్నామని పట్టణ సీఐ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. బాలాజీనగర్‌కు చెందిన జంజిరాల ప్రదీప్ గత కొన్ని నెలలుగా ఇంట్లో ఎవరు లేని సమయంలో దొంగతనాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు దొంగతనాలకు సంబంధించిన ఇంటి తాలుకూ సీసీ ఫుటేజీలను పరిశీలించగా ప్రదీప్ చోరీకి పాల్పడినట్టు తేలిందన్నారు. ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ రామానుజం ఆదేశాల మేరకు ప్రదీప్‌ను విచారించగా, 86.6 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక కారు, ఒక సెల్ ఫోన్ నగదు రూ.12వేలు లభ్యమైనట్టు సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.



ఇన్సెంటివ్ విషయంలో ఉద్యోగులకు అన్యాయం



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్పెషల్ ఇన్సెంటివ్ విషయంలో ఆర్‌కే న్యూటెక్ ఉద్యోగులకు అన్యాయం జరిగిందిని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఆరోపించారు. శనివారం వారు ఆర్‌కే న్యూటెక్ గనిని సందర్శించారు. అన్ని విభాగాలలో తిరుగుతూ ఉద్యోగుల సమస్యలు తెలుసుకున్నారు. న్యూటెక్ గని లక్ష్యం జనవరి నెలలోనే పూర్తయ్యిందని, ఫిబ్రవరి నెలలో ఇచ్చిన స్పెషల్ ఇన్సెంటివ్ ప్రతి కార్మికుడికి 2200ల రూపాయలు ఇస్తారని భావిస్తే కేవలం 1200ల రూపాయలు ఇస్తామని ప్రకటించడం దారుణమన్నారు. బొగ్గు నిల్వలు భారీగా ఉన్నప్పటికీ తక్కువ రవాణా చేసి 1200 ఇన్సెంటివ్ ఇస్తానని చెప్పడం అధికారుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. రక్షణ గ్లౌసులు, డస్ట్ మాస్కులు నిల్వ ఉన్నా ఉద్యోగులు అందించకపోవడం సరికాదన్నారు. జన్మభూమి పేరిట ఉదయం 7.30 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు పనిచేయిస్తూ భోజనానికి కూడా సమయం ఇవ్వకుండా మ్యాన్ రైడింగ్ ఆఫ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాంటీన్ వద్ద చెత్తను శుభ్రం చేయడం లేదన్నారు. కంపెనీ అవసరం నిమిత్తం సర్ఫేస్‌లో పనిచేస్తే అండర్‌గ్రౌండ్ అలవెన్సు ఇవ్వడం లేదన్నారు. ఆయా సమస్యలను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని ఉద్యోగులు నాయకులను కోరారు. కార్యక్రమంలో ఏరియా కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, సంపత్ కుమార్, ట్రేడ్స్‌మెన్ ఇన్‌చార్జి సురేష్, పిట్ కార్యదర్శి లక్ష్మణ్, సహాయ కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

కొత్తబావుల ఏర్పాటుతోనే మనుగడ

కాసిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో భూగర్భ గనుల ఏర్పాటుతోనే సంస్థ మనుగడ సాగిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. శనివారం కాసిపేట 2వ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. గత 12 ఏళ్లుగా సింగరేణిలో భూగర్భ గనులు ఏర్పాటు చేయకపోవడం వల్ల యువతకు ఉపాధి కరువైందన్నారు. దీని వల్ల నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును కాపాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరంతరంగా రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర బొగ్గు గనుల సహా యమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి సింగరేణి భవిష్యత్‌కు కొత్తగా భూగర్భ గనులను మంజూరు చేయాలని కోరామని చెప్పారు. అనంతరం 27 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి యూనియన్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి బ్రాంచ్ ఇన్‌చార్జీ చిప్పనరయ్య, కార్యదర్శి దాగం మల్లేష్, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, వెంకటేష్, నర్సయ్య, సుభాష్ చంద్రబోస్, రాజ్‌కుమార్, కేతన్, కొమురయ్య, నర్సిరెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.



కాసిపేట 2 గనిపై మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

బొగ్గు రవాణాలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న జీఎం ఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణా విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ ఆదేశించారు. ఏరియా అధికారులతో బొగ్గు రవాణా, బాటమ్ యాష్ రవాణాకు సంబంధించిన పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. గనుల ద్వారా వెలికితీసిన బొగ్గును వీలైనంత త్వరంగా రవాణా చేసి వినియోగదారులకు అందించాలన్నారు. స్టోవింగ్ మెటీరియల్ నిల్వలు ఎన్ని ఉన్నాయి, ఎంత సరఫరా అవుతుందో తెలుసుకోవాలని సూచించారు. జాగ్రత్తలు పాటించకపోతే ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని అన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజెంట్లు రాజేందర్, వెంకటేశ్వర్లు, ఏరియా సర్వే అధికారి నర్సింగరావు, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, అన్ని గనుల మేనేజర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి

బెల్లంపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ బోయిన కొమురయ్య (64) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 15రోజులుగా చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా మారి శనివారం ఉదయం మృతి చెందాడు. కొమురయ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా పని చేశాడు. తెలంగాణ ఉద్యమంలో బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి కీలక పాత్రపోషించారు. మృత దేహానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో పాటు పలు పార్టీలకు సంబంధించిన నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

ఉచిత కంటి ఆపరేషన్‌లు

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలో బండారి రాజేశ్వరి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 15 మందికి ఉచిత కంటి ఆపరేషన్‌లు నిర్వహించినట్లు వైద్యులు అభిషేక్ చిందం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు అభిషేక్ మాట్లాడుతూ మాట్లాడుతూ చెన్నూరు మండలానికి చెందిన 15 మంది నిరుపేదలకు రాజేశ్వరి ట్రస్టు ద్వారా కంటి వెలుగును ప్రసాదించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు బండారి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మందమర్రిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా లోని కేకే 5గనిపై శనివారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఐఎన్‌టీ యూసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాంశెట్టి నరేందర్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి పెద్దపీట వేసిన ఏకైక సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, కల్పన పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం సీఎస్‌పీ కార్మికుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ కనీస వేతనాల మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు.

తుప్పు తప్పు ఎవరిది..



- రూ. లక్షలు పెట్టి వాహనాల కొనుగోలు
- నాలుగేళ్లుగా నిరుపయోగంగా
- మరమ్మతులకు నోచుకోని వైనం
- రూ. కోట్ల ప్రజాధనం వృథా

బెల్లంపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మున్సిపాలిటిలో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మున్సిపాలిటిలో సంపూర్ణ పారిశుధ్య నిర్వహణ కోసం మూడేళ్ల క్రితం రూ. కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన అత్యాధునిక యంత్రాలు, వాహనాలు పనికి రాకుండా పోతున్నాయి. కోట్లు పెట్టి కొనుగోలు చేసిన వాహనాలు నేటికి వినియోగించిన దాఖలాలు లేవు. దీంతో ఈ వాహనాలు ఎండకు ఎండి వానకు తడిచి తుప్పు పడుతున్నాయి. దీనికి తోడు వాహనాలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో విడి భాగాలు చోరీకి గురవుతున్నాయి. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై పట్టణ ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

మూలన పడ్డ చెత్త సేకరణ ట్రాలీలు...

నాలుగేళ్ల క్రితం మున్సిపాలిటీలోని 34వార్డుల్లో చెత్త సేకరణ కోసం రూ. 1.30కోట్లతో మున్సిపల్ అధికారులు వాహనాలను కొనుగోలు చేశారు. ఇందులో కొన్ని ఆటో ట్రాలీలను మాత్రమే చెత్త సేకరణకు వినియోగించారు. నాలుగేళ్లుగా దాదాపు 12 ట్రాలీలకు పైగా పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మూలన పడి ఉన్నాయి. ఎండకు ఎండి వానకు తడుస్తుండడంతో ఈ వాహనాలు తుప్పు పట్టాయి. మూలన పడ్డ వాహనాలపై పర్య వేక్షణ లేకపోవడంతో ట్రాలీల టైర్లు, బ్యాటరీలు ఇతర భాగాలు చోరికి గురయ్యాయి. మరి కొన్ని వాహనాలు వినియోగంలో లేక తుప్పు పడుతున్నాయి. పట్టణంలోని 34 వార్డుల్లో చెత్త సేకరణకు ఆటో ట్రాలీలు సరిపోవడం లేదు. ప్రతి రోజు 24 టన్నులకుపైగా చెత్త సేకరించాల్సి ఉంటుంది. ట్రాలీలు సరిపడా లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది.



తుప్పు పడుతున్న చెత్తసేకరించే వాహనాలు

మూలన పడ్డ స్వీపింగ్ మిషన్ వాహనం...

పట్టణంలోని రహదారులను, మున్సిపాలిటీలోని రోడ్లను ఊడ్చేందుకు రూ. 40లక్షలు వెచ్చించి మూడేళ్ల క్రితం స్వీపింగ్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. కొన్ని నెలలు మాత్రమే వినియోగించి మూలన పెట్టారు. రెండేళ్లుగా ఒక రోజు కూడా స్వీపింగ్ మిషన్‌ను వినియోగించిన దాఖలాలు లేవు.

దీంతో రహదారులపై ఎక్కడ చూసినా ఇసుక, చెత్త పేరుకు పోయి కనిపిస్తోంది. దీంతో వాహనదారులు దుమ్ము దూళితో ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండ చెత్త సేకరణ కోసం ట్రాక్టర్లను సైతం పూర్తి స్థాయిలో వినియోగించడం లేదు. పలు ట్రాక్టర్లు చిన్న చిన్న సమస్యలతో మూలన పడ్డాయి. ఇప్పటికైన చెత్త సేకరించే ట్రాలీలను స్వీపింగ్ మిషన్, ఇతర వాహనాలకు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పారిశుధ్య విభాగానికి కేటాయించిన వాహనాలు నిరు పయోగంగా ఉన్న మాట వాస్తవమే అని త్వరలోనే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

ప్రతి రోజు చెత్త సేకరణకు రావడం లేదు...

ప్రకాశ్, బెల్లంపల్లి

ప్రతి రోజు చెత్త సేకరణకు ఆటో ట్రాలీలు రావడం లేదు. దీంతో ఇంటి పక్కనే చెత్త సేకరించి ఇంటి పక్కనే పెడుతున్నాము. వాహనాలు వచ్చిన సమయంలో చెత్త వేస్తున్నాం. రహదారుల వెంట ఇసుక, చెత్త ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అధికారులు చెత్త సేకరణపై చిత్త శుద్ధితో పని చేయాలి.

క్యాటిల్‌షెడ్ నిర్మాణ పనుల పరిశీలన

వేమనపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుంపుటం, కల్లెంపల్లి గ్రామాల్లోని కాంపౌండ్‌వాల్, క్యాటిల్‌షెడ్ నిర్మాణ పనులను శనివారం ఎంపీడీవో కుమార స్వామి పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం నర్సరీలను పరిశీలించి మొక్కలను సంరక్షించాలని, వన మహోత్సవానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. అనంతరం పోస్టాఫీసుకు వెళ్లి ఉపాధి కూలీల వేతన చెల్లింపులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్, వెంకట్ ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కుమారస్వామి

బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం

బీసీ ఆజాది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్

మందమర్రిటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమని, దీని కోసం బీసీలంతా ఒక్కతాటిపైకి రావాలని బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామ గ్రామాన సంస్థగత నిర్మాణం చేసి బీసీలకు ఉద్యమ పోరాటం బలోపేతం చేస్తామని తెలిపారు. జనాభా నిష్పత్తి ప్రకారం 60శాతంగా ఉన్న బీసీలకు రాజ్యాధికారం రాకుండా అణిచి వేస్తున్నారని తెలిపారు. ఆయా పార్టీల్లో పని చేస్తున్న బీసీలందరూ రానున్న రోజుల్లో రాజకీయ పదవుల కోసం తప్పనిసరిగా కదం తొక్కాలన్నారు. బీసీ ఆజాది ఫెడరేషన్ బలోపేతంలో భాగంగా కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అధికార ప్రతినిధి సాగర్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి లక్ష్మన్‌రావు, గజవెల్లి మనోహర్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చిలుకమర్రి శ్రీనివాస్, జిల్లా అధ్య క్షుడు భాస్కర్ పాల్గొన్నారు.

●బీసీ ఆజాది ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా మందమర్రికి చెందిన కుడికాల భాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియ మిస్తూ శనివారం బీసీ ఆజాది ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్ నియామకపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న బీసీ అజాది ఫెడరేషన్ నాయకులు

జిల్లా సరిహద్దులో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేపట్టాలి

దండేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా సరిహద్దు దండేపల్లి మండలం గూడెం ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేపట్టాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ సూచించారు. మంచిర్యాల-జగిత్యాల జిల్లాల సరిహద్దులో గల దండేపల్లి మండలం గూడెం ఆటవీ చెక్ పోస్టు వద్ద ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టును శనివారం తనిఖీ చేశారు. అక్రమ రవాణా, గంజాయి ఇతర అక్రమంగా తరలించకుండా వాటిని అరికట్టేందుకు గూడెం పోలీసు చెక్‌పోస్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట దండేపల్లి ఎస్సై తైసోనోద్దీన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుదారులకు సమాచారం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

జైపూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ 2020 దరఖాస్తుదారులకు స్వయంగా సమాచారం అందించాలని ఎంపీడీవో సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్‌లో భాగంగా దరఖాస్తు దారులకు మొబైల్ ద్వారా సమాచారం చేరవేసి వారి సందేహాలను నివృత్తి చేయాలన్నారు. ఈ నెల 31లోగా దరఖాస్తు రుసుము చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వస్తుందని దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌వీ నాయకుల ముందస్తు అరెస్టు

చెన్నూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపును నిరసిస్తూ శనివారం అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్ పిలుపునివ్వగా చెన్నూరుకు చెందిన బీఆర్‌ఎస్‌వీ నాయ కులను పోలసీులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో పట్టణాధ్యక్షుడు నయాబ్‌ఖాన్, నాయకులు ప్రశాంత్, తిరుపతి, సురేష్ పాల్గొన్నారు.

కోటపల్లి: పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రభుత్వాన్ని కొనసాగించలేరని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ అన్నారు. బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉండగా ముందస్తుగా బీఆర్‌ఎస్‌వీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి కోటపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ ఏ చిన్న కార్యక్రమం అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అరెస్టులు చేస్తూ అగమాగం చేస్తుందని, అడుగడుగునా అక్రమ అరెస్టులతో ఈ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. నాయకులు అనిల్, బాపునాయక్ పాల్గొన్నారు.



చెన్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

●**పరీక్షా కేంద్రం తనిఖీ**

జైపూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, తహసీల్దార్ వనజారెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షకేంద్రం పోలీసులు పకడ్బందీగా బందోబస్తు నిర్వహించాలని ఏసీపీ సూచించారు. ఏసీపీ వెంట ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

రామకృష్ణాపూర్: పదో తరగతి పరీక్ష కేంద్రాలను శనివారం మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

వేమనపల్లి : వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ రమేష్ తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బం దీగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఎం ఈవో శ్రీధర్ రెడ్డి ఉన్నారు.

●**రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్**

రామకృష్ణాపూర్: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడవద్దని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. శనివారం రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎస్ఐ రాజశేఖర్ ఉన్నారు.

●**ఆయిల్‌పామ్ సాగుకు రాయితీ**

నెన్నెల: ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ఏఈవో రాంచందర్ అన్నారు. మొక్కల కొనుగోలుకు, డ్రిప్పు ఏర్పాటుకు సబ్సిడీ అందజేసి ప్రభుత్వం సాగును ప్రోత్సహిస్తుందన్నారు. శనివారం మన్నెగూడంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

●**సరుకులు అందజేత**

దండేపల్లి: దండేపల్లి గ్రామానికి చెందిన వేమునూరి మొగిళి అనే నిరుపేద కుటుంబానికి అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులతో పాటు 25కేజీల బియ్యం బస్తాను శనివారం నిర్వహకులు అందజేశారు.

●**జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక**

కాసిపేట: జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి గురునాధం శంకర్‌గౌడ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శంకర్ శనివారం తెలిపారు. ఏప్రిల్ 16 నుంచి 19 వరకు మణిపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

●**వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి**

మందమర్రిటౌన్ : పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కొత్తగూడెం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటి సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక కేకే 1 కాలనీలోని సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులతో ఆయన మాట్లాడారు.

●**డ్రైనేజీ పనుల పరిశీలన**

మందమర్రిటౌన్ : పట్టణంలోని రాష్ట్రీయ రహదారి వద్ద గల డ్రైనేజీని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బండి సదానందం యాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

●**విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి**

బెల్లంపల్లి రూరల్ డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపెల్లి శంకర్ అన్నారు. శనివారం కళాశాలలో గెట్టుగెదర్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తిరుపతి, మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

●**వాలీబాల్ కిట్‌లు పంపిణీ**

జన్నారం: మండల కేంద్రంలోని పొనకల్ గ్రామ యువకులకు పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ శనివారం వాలీబాల్ కిట్‌లను అందజేశారు. యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు వాలీబాల్ కిట్‌ను అందించినట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాగుల శంకర్, కోటి జలంధర్ పాల్గొన్నారు.

●**చలివేంద్రం ప్రారంభం**

నెన్నెల: చిన్న వెంకటాపూర్ బస్టాప్ వద్ద మున్నమ్మ-రహీంల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై ప్రసాద్ శనివారం ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన జీబీల్‌ను సీఐ అభినందించారు. ఈ కార్య క్ర మంలో నాయకులు జాడి రాజ్‌కుమార్, దేవేందర్, భీష్మయ్య, పోషమల్లు, రగునయ్య, మంజూనాయక్ పాల్గొన్నారు. అనంతరం సీఐ, ఎస్సైలను గ్రామస్థులు సన్మానించారు.

దేశ భవిష్యత్‌ను నిర్ధారించే శక్తి యువతపై ఉంది

ఆర్‌డీవో గూడూరి శ్రీనివాసరావు

కోల్‌సిటీటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో మార్పు తెగలిగే శక్తి యువతలో ఉందని జిల్లా ఆర్‌డీవో, సబ్ డివిజన్ మేజిస్ట్రేట్ గూడూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు ప్రసంగిస్తూ ప్రపంచ దేశాల్లోనే అత్యధిక యువత భారతదేశంలోనే ఉందని కాబట్టి దేశ భవిష్యత్‌ను నిర్ధారించే శక్తి యువతరంపై ఉందన్నారు. అనంతరం వన్‌నేషన్, వన్ ఎలక్షన్, పేవింగ్ ది వేపర్ వికసిత్ భారత్‌పై విద్యార్థులు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువ పార్లమెంట్ నోడల్ అధికారి ఎ.సాంబశివరావు, కళాశాల ప్రిన్సిపల్ జైశంకర్ ఓజా, పెద్దపల్లి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం

జన్నారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. కలమడుగు, సింగరాయిపేట, తిమ్మాపూర్, కిష్టాపూర్, రాంపూర్, కవ్వాల, మొర్రిగూడ గ్రామాల్లో కురిసిన వర్షానికి మొక్కజొన్న పంట నేలవాలింది. శనివారం మండల

అసైన్డ్ భూముల లెక్క తేలేనా..?

(5వ పేజీ తరువాయి)

నీటిపారుదల శాఖలను కూడా భాగస్వాములను చేస్తోంది.

పూర్తిస్థాయిలో దరఖాస్తుల పరిశీలన..

గతంలో మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది క్షేత్ర స్థాయిలో పరిశీలించేవారు. కొత్త ఆదేశాల మేరకు ఇప్పుడు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మున్సిపల్ ప్రణాళిక విభాగం సూపర్‌వైజర్‌తో పాటు నీటి పారుదల శాఖ ఏఈ, రెవెన్యూ ఇన్‌స్పె క్టర్, ముగ్గురు కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తు వివరా లను పూర్తిస్థాయిలో పరిశీలిస్తారు. అది ప్రభుత్వ, అ సైన్డ్ భూమా ? ప్రైవేటు స్థలామా...? వివాదాలు ఏమైనా ఉన్నాయా ? అనేది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గుర్తి స్తారు. బఫర్ జోన్ నిబంధనల మేరకు చెరువులు, కుంటలు, వాగులు, నాలాల పక్క నుంచి ఎంత దూ రంలో ఉంది...? అనుమతులు ఇవ్వాలా లేదా అనేది నీటి పారుదల శాఖ ఏఈ పర్యవేక్షిస్తారు. ఆ స్థలం నివాస ప్రాంతం (రెసిడెన్షియల్ ఏరియా), వాణిజ్య ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం.. ఇలా ఏ జోన్‌లోకి వస్తుంది, జత చేసిన పత్రాలు సరినవా...కావా అనేది పట్టణ ప్రణాళిక విభాగం సూపర్ వైజర్ గుర్తిస్తారు. తద్వారా అసైన్డ్ భూములను గుర్తించడం తేలిక కానుంది. వీరు ముగ్గురు ఆమోదించాకే ఎల్ 1 లాగిన్ నుంచి పట్టణ ప్రణాళిక విభాగం అధికారి (ఎల్ 2 లాగిన్)కి దరఖాస్తును పంపిస్తారు. అక్కడి నుంచి ఎల్ 3 లాగిన్ పర్యవేక్షించే మున్సిపల్ కమిషనర్‌కు వెళుతుంది. రుసుం చెల్లించాక కమిషనర్ ఆమోదంతో ఎల్ఆర్ఎస్ పత్రం జారీ చేస్తారు. పెద్ద లే అవుట్‌ల క్రమబద్ధీకరణ రికార్డులను ఎల్ 4 దశలో భాగంగా కలెక్టర్ల పరిశీలనకు పంపుతారు.

● **అసైన్డ్ భూముల్లో రియల్ వెంచర్లు..!**

జీవనోపాధి కోసం ప్రభుత్వం అర్హతగల వారికి పంపిణీ చేసిన అసైన్డ్ భూముల్లో విచ్చల విడిగా ప్లాట్ల వెంచర్లు వెలిశాయి. జిల్లా కేంద్రంలోని నస్పూర్‌లో గల సర్వే నెంబర్లు 42, 64లలోని అసైన్డ్ భూ ముల్లో బడా వెంచర్లు వెలిశాయి. అంతేకాదు గిరిజన చట్టాల ప్రకారం అర్హులైన పేదలకు పంపిణీ చేసిన భూములను సైతం వదలిపెట్టలేదంటే అతిశ యోక్తికాదు. 1966 కంటే ముందు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములకు ఎన్‌ఓసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫి కెట్లు)లు జారీ అయ్యాయి. దాన్ని అవకాశంగా మలు చుకొని కొందరు ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలు పెట్టారు. ఇదే అదునుగా కొందరు నకిలీ ఎన్‌వోసీలు సృష్టించి అమ్మడానికి వీలులేని భూములను అన్యాక్రాంతం చేశారు. జిల్లాలోని దండేపల్లి, మందమర్రి మండలాల్లో గిరిజన భూముల్లో నూ వెంచర్లు వెలిశాయి. అయితే ఎల్ఆర్ఎస్ సమయంలో అసైన్డ్ భూములను కనుగొనడం కొంత ఇబ్బందిగా మారగా, కొత్త మార్గదర్శకాలతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో వేగం పెరుగనున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● **ఆందోళనలో అక్రమార్కులు..**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రధానంగా అసైన్డ్ భూములపై దృష్టి పెట్టనుండడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ప్లాట్లు కొన్నవారు సైతం ఆందోళనకు గురవుతున్నారు. గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేదల నుంచి అసైన్డ్ భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేసి ఇష్టారీతిన విక్రయించారు. అందులో ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారు క్షేత్రస్థాయి పరిశీలనలో అవి అసైన్డ్ భూములని తేలితే ఎక్కడ తమను నిలదీస్తారేనన్న భయం రియల్ ఎస్టేట్ వ్యాపారుల ను వెంటాడుతోంది. ఇప్పటికే చాలా మంది తమ ఇంటి స్థలం ఎలాంటి వివాదంలోనైనా చిక్కుకుని ఉందా అన్న విషయమై తమదైన మార్గాల్లో ఆరా తీస్తుండగా, అధికారులు కఠినంగా వ్యవహిస్తే కబ్జాలకు గురైన అసైన్డ్ భూములు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వ భూమి స్వాధీనం

తాండూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అచ్చలాపూర్ గ్రామ శివారులోని సర్వే నెంబరు 1295లోని 3 ఎకరాల అసైన్డ్ భూమిని శనివారం తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వే నెంబరులోని భూమికి కేశెట్టి మల్లమ్మ పేరిట ప్రభుత్వం నుంచి అసైన్‌మెంట్ పట్టా ఇచ్చిందన్నారు. తర్వాత ఈ స్థలం తమదని రత్నం తార ప్రజావాణిలో దరఖాస్తు చేసిందన్నారు. దీంతో భూమిని మోకాపై పరిశీలించి ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమి అని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉత్తర్వులు వచ్చే వరకు ఎవరు ఈ స్థలంలోకి రావద్దని ఇరు వర్గాలను హెచ్చరించారు. ఈ నివేదికలను బెల్లంపల్లి ఆర్డీవోకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌కుమార్, ఆర్ఐ ఎజాజుద్దీన్ పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు

బెల్లంపల్లి రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం బెల్లంపల్లి మండలంలోని సోమగూడెం, ఆకనపల్లి గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31లోపు ఇంటి పన్ను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దటి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట ఎన్‌సీవో శ్రీనివాస్, ఉన్నారు.

రాజారాం గ్రామస్థులకు తాగునీటి సౌకర్యం

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కోటపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాజారాంలో తాగునీటికి కష్టాలు అనే శీర్షికన ఈ నెల 16న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో అస్గర్ మొహియొద్దీన్‌లు పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్‌లు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌లను వేయడంతో పాటు నల్లాలు బిగించగా సమస్య పరిష్కారం అయ్యింది. దీంతో కాలనీ వాసులు మిషన్ భగీరథ ద్వారా నీటిని పట్టుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు.

నీటిని పొదుపుగా వినియోగించాలి

మందమర్రిరూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా వినియోగించాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సండ్రోన్‌పల్లి గ్రామంలోని రైతు వేదికలో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సకల ప్రాణి కోటి వనుగడకు నీరే జీవనాధారమని, ప్రతి ఒక్కరు నీటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం వ్యవసా యాధికారిణి కిరణ్మయి మాట్లాడుతూ సూక్ష్మ నీటి పారుదల పద్ధతులపై అవగాహన పెంచుకుని నీటిని పొదుపు చేయాలన్నారు. డ్రిప్ తుం పర్లు చేసే పరికరాలను రైతులు వినియోగించాలని సూచించారు. అనంతరం నీటిని పొదుపు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్ర మంలో భూగర్భ జలశాస్త్రవేత్త గణేష్, ఏఈవో ముత్యం తిరుపతి, సహాయ భూగర్భ భౌతిక శాస్త్రవేత్త దివ్య, కనకరాజు, పంచాయతీ రాజ్ ఏఈ ఇసాక్, చిర్రకుంట మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్య, జనార్ధన్, వెంకటేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల పనుల పరిశీలన

కోటపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొల్లూరు , పారుపెల్లి, పిన్నారం, ఎడగట్ట, ఎసన్‌వాయి గ్రామాల్లో సంక్షేమ పథకాల అభివృద్ధి పనులను ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో అస్గర్ మొహియొద్దీన్, ఏపీవో వెంకటేష్‌లు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న నర్సరీ పనులు, పాఠశాలల ప్రహరీ గోడ పనుల ప్రగతిని పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలని మొక్కలను సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

- పేరుకే ఊరికో వైకుంఠధామం
- అనువుగాని చోట నిర్మాణాలు
- నిర్వహణలోపంతో నిరుపయోగంగా మారిన వైనం
- నీటి వసతి, సౌకర్యాలు కరువు
- రూ.లక్షల్లో ప్రజాధనం వృథా
- అధికారులు దృష్టి పెడితేనే ప్రయోజనం



అంతిమ సంస్కారానికి అవస్థలే

జిల్లాలో అంతిమ సంస్కారాలకు అవస్థలు తప్పడం లేదు. ప్రభుత్వం ఊరికో వైకంఠధామం నిర్మించినా అనువుగానీ చోట చేపట్టడంతో ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు.

బెజ్జూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పల్లెల్లో నిర్మించిన వైకుంఠధామాల పరిస్థితి ప్రస్తుతం అధ్వానంగా మారిది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధిహామీ పథకం కింద 2018-19లో ఒక్కోదానికి నిర్మాణం కోసం రూ.12లక్షలు మంజూరు చేసింది. పట్టణ ప్రాంతాల్లో కొన్నిచోట్ల అంత్యక్రియలకు ఉపయుక్తంగా ఉన్నప్పటికీ చాలా గ్రామాల్లో అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తే చాలా వరకు వినియోగంలోకి వస్తాయి. కానీ అధికారులు మాత్రం వీటిపై దృష్టి సారించని కారణంగా ప్రజలకు చివరి మజిలీకి కష్టాలు తప్పడం లేదు.

● పల్లెప్రగతిలో భాగంగా..

పల్లెప్రగతిలో భాగంగా ప్రతీ గ్రామంలోనూ వైకుంఠధామం నిర్మించారు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలాలతో పాటు దాతల నుంచి సేకరించిన భూములను ఇందుకోసం కేటాయించారు. సొంతభూములు లేనివారికి ఇవి ఉపయోగపడతాయని భావించారు. దహనం చేసే గద్దెలతో పాటు స్నానాల గదులు, హాల్ నిర్మించారు. నీటి సౌకర్యం కోసం బోర్లు కూడా వేశారు. అయితే విద్యుత్ సౌకర్యం లేక బోర్లు పనిచేయడం లేదు. వైకుంఠధామాల వద్ద లైట్లు వెలగకపోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. వైకుంఠధామాలకు వెళ్లడానికి దారులు లేక అంత్యక్రియలకు సైతం అటువైపు చూడడం లేదు. దీంతో గద్దెల చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. గదులు, స్నానాల గదులు ధ్వంసమవుతున్నాయి. దీంతో నిర్వహణ లేక లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతున్నది.



రెబ్బెన మండలం లక్ష్మీపూర్‌లో రోడ్డు సౌకర్యం లేని వైకుంఠధామం

● 15 మండలాల పరిధిలో..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 15మండలాల పరిధిలో 335గ్రామపంచాయతీలు ఉన్నాయి. అన్ని పంచాయతీల పరిదిలో వైకుంఠధామాలను నిర్మించారు. వాటి నిర్వహణపై అధికారయంత్రాంగం దృష్టి సారించకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వైకుంఠధామాల నిర్వహణ అస్తవ్యస్తవంగా మారడంతో గ్రామాల్లో ఎవరైనా చనిపోతే గ్రామాల సమీపంలో వాగులు, చెరువుల వద్ద అంత్యక్రియలను చేస్తున్నారు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా మారాయి. లక్షలు వెచ్చించినా వినియోగంలో లేకపోవడం, వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. పల్లెల్లో సైతం ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో అన్ని భూముల్లోనూ వ్యవసాయ పంటలు సాగు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో దహన సంస్కారాలకు చోటులేకుండా పోయింది. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మిస్తే ప్రజలకు మేలు కలుగుతుందన్న అభిప్రాయంతో ఏర్పాటు చేయగా తొలుత వాటి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించారు. అన్ని చోట్ల నీటి వసతి, విద్యుతు సౌకర్యం కల్పించ లేదు. దీంతో నిర్వహణ లేకుండా పోయింది. వినియోగంలో లేకపోవడంతో జిల్లాలోని పలు చోట్ల వైకుంఠధామాల్లో పిచ్చిమొక్కలు నిండి పూర్తిగా ధ్వంసమవుతున్నాయి. వాటి నిర్వహణను అధికారులు గాలి కొదిలేయడంతో ప్రజలకు చితి తంటాలు తప్పడం లేదు. వీటి నిర్వహణపై ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి సారించి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రావి శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీసు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఇటీవల జిల్లా ఇనన్‌చార్జి మంత్రి సీతక్కతో పాటు కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడంతో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్ర సాద్‌రావు తెలిపారు. ఆసిఫాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడా రు. వారం రోజుల్లో క్రమ శిక్షణ కమిటీ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిం చారని చెప్పారు. ఇటీవల కాలంలో పార్టీ నాయకులపై విలేకరుల సమావేశంలో రావి శ్రీనివాస్ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తుండడంతో తాము రాష్ట్ర నాయకత్వానికి గురువారం ఫిర్యాదు చేశామని అన్నారు. ఇటీవల పార్టీ కార్యాక్రమాల్లో సైతం శ్రీనివాస్ పాల్గొనడం లేదని తాము ఫిర్యాదులో వివరించా మని అన్నారు. తమ ఫిర్యాదును పరిశీలించి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి షోకాజు నోటీసు జారీ చేశారని తెలిపారు.

రావి శ్రీనివాస్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ మంత్రి సీతక్కపై చేసి వ్యాఖ్యలను ఖండిస్తున్నా మని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం ఆయన ఆదివాసీ సంఘాల నాయకులో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ సమాజం మొత్తం రావి శ్రీనివాస్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తుందన్నారు.. మంత్రికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక వేళ అలా చెప్పక పోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.సమావేశంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, విశ్వనాథ్, శ్యాం, చరణ్, వసంత్‌రావు, సుధాకర్, రూప్‌నార్ రమేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేడు జై భారత్ కార్యక్రమం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జైబాపు, జై భీం, జై సంవిధాన్, జై భారత్ కార్యక్రమం నిర్వహించనున్నామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహాత్మాగాంధీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి వంద సంవత్సరాలు పూర్తి కావడం, రాజ్యాంగాన్ని రచించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, నాయకులు శ్యాం, చరణ్, ఖలీం పాల్గొన్నారు.

ప్రజలను భయాందోళనకు గురి చేయొద్దు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సిర్పూర్ నియోజక వర్గంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే చూస్తూ ఉర్కొనేది లేదని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బెజ్జూరు మండలంలోని పాపన్నపేట, లుంబిని నగర్, కౌటాల, మండలంలోని గంగాపూర్, చింతలమానేపల్లి మండలంలోని దిందా, కర్జవెల్లి గ్రామాల్లో గృహ అవసరాల కోసం అటవీ అధికారులు మంచినీటి బోర్లు వేయించుకుంటే అడ్డుకుంటున్నారని అన్నారు. పాత పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటే అడ్డుకోవడం సరికాదని చెప్పారు. మంచినీరు, పాత పోడు సమస్యలపై అటవీ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. పోడు భూముల పట్టాలు ఇవ్వాల్సిన బాధ్యత పాలకులు, ప్రభుత్వానికిదేనని అన్నారు. పెంచికలపేట మండలంలోని ఆగర్‌గూడ గ్రామంలో రోడ్లు వేస్తే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. అనంతరం అటవీ శాఖాధికారులకు వినతి పత్రం అందజేశారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ మాంతయ్య, నాయకులు బషరత్‌ఖాన్, వెంకన్న, తిరుపతి, శ్రీనివాస్, ఇస్తారి, సకారాం, సతీష్, అమీరుద్దీన్, కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజన్, సీఐలు శ్రీనివాసరావు, రమేష్, ప్రసాద్‌రావు, ఎఫ్ఆర్వో ఇక్బాల్, ఎస్సై ప్రవీణ్ పాల్గొన్నారు.

మహుల్కర్ అశోక్‌కు ఉత్తమ మోటివేటర్ అవార్డు

వాంకిడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహుల్కర్ అశోక్‌కు ఉత్తమ మోటివేటర్ అవార్డును భూటన్‌లో శనివారం అందజేశారు. మారుమూల ప్రాంతంలో అంబేద్కర్, బుద్దుడి ధర్మ ప్రచారం చేసినందుకు అందజేశారని అశోక్ తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 23 నుంచి 30 వరకు నిర్వహించే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సభల పోస్టర్లను శనివారం పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిరుపతి, అయ్యాబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై దృష్టి సారించాలి

రెబ్బెన, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అనేక అవకాశాలు కల్పిస్తోందని, ఈ క్రమంలో చేపల పెంపకంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాలోని రెబ్బెన మండలం లేతన్‌గూడ గ్రామంలో ఇందిరమ్మ మహిళ శక్తి పథకం కింద ఏర్పాటు చేసిన చేపల పెంపకం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిర మహిళ శక్తి పథకం ద్వారా అనేక అంశాలలో మహిళ స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూతనిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ఇందిరమ్మ మహిళ శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సభ్యులు చేపల పెంపకం ద్వారా మరింత ఆదాయాన్ని పొందవచ్చన్నారు. మహిళ సంఘాలను చేయూతనిస్తున్నట్టు తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుందుకు మహిళ సంఘాల సభ్యులకు వ్యాపారాలు చేసేందుకు రుణాలను అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అదికారి రామకృష్ణ, తహసిల్దార్ రాంమోహన్ రావు, ఎంపీడీఓ శంకరమ్మ, ఎ.పి.ఎం.లు, సీసీలు మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

అర్ధమండల దీక్షలు ప్రారంభం



భక్తులకు మాలధారణ చేస్తున్న పండితులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఏప్రిల్ 12వ తేదీన హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం 120 మంది హనుమాన్ భక్తులు అర్ధమండల దీక్షలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ, శ్రీనివాస్ శర్మ, శేఖర్‌శర్మల ఆధ్వర్యంలో దీక్షా పరులకు మాలధారణ కార్యక్రమం నిర్వహించారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

చింతలమానేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పోడు భూముల పేరుతో రైతులను అటవీ అధికారులు ఇబ్బందులు పెడితే ఊర్కోబోమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అంబగట్టు, కోర్సిని, బూరెపల్లి, దిందా, గూడెం, కర్జవెల్లి, తదితర గ్రామాల్లో 70 ఏళ్లుగా భూములను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్న రైతుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నాని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వస్తే పోడు భూములకు పట్టాలిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో నాయకులు రాజేందర్‌గౌడ్, మల్లయ్య, విజయ్, రామన్న, అంకులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం



గుంటూరుకాలనీలో లేచిపోయిన ఇంటిపైరేకులు

ఈదురు గాలులు.. వడగళ్ల వర్షం

కాగజ్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు చోట్ల శుక్రవారం రాత్రి, శనివారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డు కాలనీ, మార్కెట్ ఏరియా, ఫారెస్టు కార్యాలయ రోడ్డుపై ఉన్న పెద్ద చెట్టు గాలి తీవ్రతకు పడిపోయింది. దీంతో రాక పోకలు నిలిచి పోయాయి. వీటితో పాటు 12 కరెంటు స్తంభాలు నెలకొరిగాయి. సర్‌సిల్క్ కాలనీ, మార్కెట్ ఏరియా, ఇండస్ట్రీరియ్ ఏరియాలో కరెంటు సరఫరా పూర్తిగా నిలిచి పోయింది. కాగజ్‌నగర్ పోచమ్మ బస్తీ కాలనీలో ఉన్న 150 సంవత్సరాల గల భారీ రావి వృక్షం నెలకొరిగింది. ఎస్పీఎం కాలనీల్లో కూడా పలు చెట్లు కూకటి వేళ్లతో నెలకొరిగాయి. మార్కెట్‌లోని దోబీఘాట్ సమీపంలో రెండు ఇళ్లల పై రేకుల లేచి పోవడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. నజ్రూల్‌నగర్ వీలేజి నంబరు 7లో శుక్రవారం వడగండ్ల వానతో అమిత్ మండల్ అనే వ్యక్తి ఫారంలో 300 కడక్‌నాథ్ కోళ్ల మృతి చెందాయి.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం వడగళ్ల వాన కురిసింది. కూరగాయలు, జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతింటాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి శుక్రవారం సాయంత్రం ఈదురుగాలల బీభత్సంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. దీంతో మండలంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు టార్చ్‌లైట్ సహాయంతో పరీక్షల కోసం చీకట్లోనే చదువుకున్నారు. శనివారం సైతం విద్యుత్ సరఫరా లేక పోవడంతో పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు ఉక్కపోత మధ్యనే పరీక్ష రాశారు.



కెరమెరిలో కురిసిన వడగళ్లు



దహెగాంలో కరెంట్ పోవడంతో టార్చ్ లైట్ల సాయంతో చదువుకుంటున్న విద్యార్థినులు

● సంక్షిప్తం..

● ఆసిఫాబాద్, రూరల్ (ఆంధ్రజ్యోతి): రాజంపేట గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన దినసరి, వార, మేకల సంతలకు వేలం పాట నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి కిరణ్ తెలిపారు.

● జైనూర్, (ఆంధ్రజ్యోతి): జైనూర్‌లో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈవో మధుకర్ తెలిపారు.

● ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయలని డీవైఎఫ్ఐ, టీఏజీఎస్ నాయకులు మున్సిపల్ కమిషనర్ భుజంగరావుకు వినతి పత్రం అందజేశారు.

● వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేజాపూర్‌లో వైద్యాధికారి వినయ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.

పోరుగడ్డపై జాతీయ పురస్కార వేడుకలు



మాట్లాడుతున్న బుల్లి తెర నిర్మాత, దర్శకుడు సురేష్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన కుమరం భీం ఆసిఫాబాద్ గడ్డపై జాతీయ పురస్కార అవార్డుల వేడుకను నిర్వహించనున్నామని బుల్లి తెర నిర్మాత, దర్శకుడు నాగబాల సురేష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవజ్యోతి సాంస్కృతిక సంస్థ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిందని చెప్పారు. సినిమా రంగంలో తనదైన ముద్ర వేసుకున్న డైలాగ్ కింగ్ సాయికుమార్ సినీ జీవితం 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కుమరం భీం జాతీయ పురస్కార కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ప్రేమలా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించ నున్నామని తెలిపారు. భారత్ కల్చరల్ అకాడమి, ఆదివాసీసంస్కృతిక పరిషత్, ఓం సాయితేజ ఆర్ట్స్, నవజ్యోతి సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాయికుమార్ హాజరవడంతో పాటు మాజీ ఐఏఎస్ పార్థసారథి, హాస్యనటులు బాబుమోహన్, శివారెడ్డి, నిర్మాతలు రాహుల్ యాదవ్, విజయ్‌కుమార్‌లు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సభ్యులు అర్జుమాస్టర్, దసురు, సుధాకర్, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, మధు, చంద్రశేఖర్, రాధాకృష్ణచారి, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలపడాలి

లింగాపూర్ మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, నేషనల్ కోఆర్డినేటర్ చల్ల సౌజన్య అన్నారు. మండలంలోని చోర్‌పల్లి గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన ఇందిరా ఫెల్లోషిప్ రాష్ట్ర బూట్‌క్యాంప్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతిభవెంకటేష్, చోర్‌పల్లి గ్రామ పటేల్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి సుగుణ